# భార్య

తటవర్తి రామకృష్ణ

పట్టాభి మౌనం వహించేడు మిత్రుడి మాటలు విని.

ఒకనిముషం ఓపికపట్టాడు గాండీవి. ఆ తర్వాత ఇక ఆగలేక-

"ఏమంటావు? దీని గురించి ఎందుకంతగా ఆలోచన? దీనివల్ల నీకు పేరు వస్తుంది తప్ప జరిగే కీడు ఏముంటుంది గనుక?" అన్నాడు.

"అహా... దాని గురించి కాదు..." అంటూ నసిగాడు పట్టాభి.

"ఒక రకంగా చెప్పాలంటే మన తెలుగువాళ్ళం ఈ విషయంలో చాలా వెనకబడి ఉన్నాం. నేను నార్తులో వున్నప్పుడు చూశాను. బెంగాలీ డ్రామా అంటే చాలు అందులో రెండు, మూడు స్త్రీ పాత్రలు వుండవల్సిందే. ఆ పాత్రలని సంసార స్త్రీలు పోషించవల్సిందే. మనలో అలా ముందుకువచ్చే ఆర్టిస్టులు లేరు. అందుకు కారణం నటించడం చేతకాక కాదు. స్టేజి ఎక్కితే ఏదో పరువు మంటగల్సిపోయిందని మన వాళ్ళ అపోహపడటం" అన్నాడు గాండీవి.

పట్టాభి చిన్నగా అన్నాడు.

"అదే... నాకు అభ్యంతరం లేదురా ...కానీ శ్రీలత ఏమంటుందో..."

"ఆమె కాలేజీలో చదువుతుండగా నాలుగైదు డ్రామాల్లో నటించి బహుమతి గెల్చుకుందని నువ్వే చెప్పావు. ఇప్పుడు వెయ్యబోయే నాటకంలో ఆమె హీరోయిన్‌గా నటించడం నీతో పెళ్ళి జరిగేక మొదటిసారి. అంతేగా! కళాకారిణిలో కళాతృష్ణ ఎంతగా అణగదొక్కితే అంతగా పైకి విజృంభించడానికి ప్రయత్నిస్తుంది, నిప్పు అంటించిన తారాజువ్వలాగ. నా దర్శకత్వంలో నా సరసన నటించడానికి ఆమెకు ఎలాంటి అభ్యంతరం వుండదు. నువ్వు అంగీకరించు ముందు. ఆమెను నేను ఒప్పిస్తాను..." అన్నాడు గాండీవి.

అంగీకారంగా తల ఊపాడు. పట్టాభి.

"థ్యాంక్యూ - సాయంత్రం మీ ఇంటికి వస్తాను. ఆమెతో మాట్లాడతాను ..." అంటూ శలవు తీసుకున్నాడు గాండీవి.

గాండీవి, పట్టాభి ఒకే ఆఫీసులో పని చేస్తారు. మంచి స్నేహితులు. గాండీవి తరుచు నాటకాల్లో వేషాలు వెయ్యడమే కాక దర్శకత్వం కూడా చేస్తాడు. చురుకైన యువకుడు. ఇంకా పెళ్ళి కాలేదు.

పట్టాభి భార్య శ్రీలత. పెళ్ళిజరిగి ఆరు నెలలు అయ్యింది. కాపురానికి భార్యను తీసుకువచ్చాక మిత్రులందర్నీ పిలిచి బ్రహ్మాండంగా పార్టీ చేశాడు పట్టాభి.

ఆ పార్టీలోనే గాండీవికి శ్రీలతతో పరిచయం అయ్యింది. ఆమెను చూసి ఆశ్చర్యపోయాడు. వెంటనే చూపులు మరల్చుకోలేకపోయాడు. భూ ప్రపంచంలో ఇంత అందమైన అమ్మాయిలు వుంటారంటే అతనికి ఎందుకో నమ్మబుద్ధి కాలేదు. కానీ తన కళ్ళఎదురుగా ఇంత అందమైన మూర్తి సజీవంగా కనిపించి చిరునవ్వు లొలికిస్తుంటే నమ్మకపోవడం ఎలా?

ఆ రోజు పార్టీలో గాండీవి చూపులు శ్రీలతకే అంకితమైపోయాయి. ఆమె ఎటు కదులుతుంటే అటే తన చూపుల్ని తిప్పాడు.

గాండీవి నటించిన ఒక నాటకం ఆ తర్వాత శ్రీలత చూసింది. అతని నటనా ప్రతిభకు ఆమె ముగ్ధురాలై పోయింది. తరుచుగా తమ ఇంటికి వచ్చే గాండీవికి కొంచెం చేరువ అయ్యింది.

టౌన్‌హాల్లో ఒక నాటకం ప్రదర్శించడానికి అన్ని సన్నాహాలూ చేసుకున్నాడు గాండీవి. నాటకం వారంరోజులుండనగా ముంచుకొచ్చింది ఒక కష్టం. ఆ నాటకంలో వెయ్యడానికి ఒప్పుకున్న ప్రొఫెషనల్ లేడీ ఆర్టిస్టు తన ఆరోగ్యం దెబ్బతిన్న కారణంగా నాటకం వెయ్యలేనంది. దాంతో గాండీవి డీలాపడిపోయి 'ఎలాగరా భగవంతుడా' అని ఆలోచిస్తున్న తరుణంలో అతనికి శ్రీలత గుర్తుకొచ్చింది ... ఆ అందాలరాశిని తన నాటకంలో వెయ్యమని ప్రాధేయపడితే? ....ఈ వంకతో ఆమెతో కొన్ని మధుర క్షణాలు గడపడమేకాక ఆమెకు మరింత దగ్గర కావచ్చు. పైగా ఆమె తన కాలేజీ రోజుల్లో స్టేజి ఎక్కి నాటకాలు వేసిందన్న విషయం పట్టాభి చెప్పాడు. ఈ ఆలోచన రాగానే ఇక ఆలస్యం చెయ్యకుండా పట్టాభిని ఒప్పించే ప్రయత్నం చేశాడు. అతను ఒప్పుకోగానే సగంపని అయిపోయిందన్న రిలీఫ్ కల్గింది.

ఆ సాయంత్రం పట్టాభితో పాటు వెళ్ళాడు గాండీవి.

"రండి..." అంటూ చిరునవ్వుతో ఆహ్వానించింది శ్రీలత.

"మీ శ్రీవారి అంగీకారం దొరికింది ... మీరు నా కోసం ఒక బృహత్తర

మైన కార్యం చెయ్యాలి. నా ఆశ విరాశ కాదని నా నమ్మకం ..." అన్నాడు గాండీవి.

"ఏమిటండోయ్ అది?" అంది శ్రీలత.

వివరంగా చెప్పాడు గాండీవి.

తన ఎత్తుగుండెలమీద చేతులు వేసుకుని భయం నటిస్తూ, అందమైన తన కళ్ళను మరింత విశాలం చేసి—

"అమ్మో! ... నాకు భయం ..." అంది.

"అలా అనకండి... మీ అనుభవం నాకు తెలుసు..." అన్నాడు గాండీవి.

"అది వేరండీ...తోటి పిల్లలముందు స్టేజి ఎక్కి సరదాగా నాటకం వెయ్యడం వేరు... ఇలా టౌన్‌హాల్లో అందరి ముందూ నాటకం వెయ్యడం వేరు..."

"ఏం కాదు. రెండూ ఒకటే. అది చేతనయినవాళ్ళకు ఇదీ వచ్చేస్తుంది ఆటోమేటిగ్గా. తర్ఫీదు ఇయ్యడానికి నేను వున్నాను కదా ... నా పరిస్థితి అర్థం చేసుకోండి. నేను నలుగురిలో నవ్వుల పాలు కాకుండా వుండాలంటే మీరు ఒప్పుకోక తప్పదు. మీరు తప్ప ఎవ్వరూ నన్ను రక్షించలేరు..." అన్నాడు చేతులు జోడించి గాండీవి.

అతని తీరుకి నవ్వు వచ్చింది శ్రీలతకి.

"ఏమండీ...మీరేమంటారు?" అంది భర్తను.

పట్టాభి చెప్పబోతుంటే గాండీవే అన్నాడు—

"చెప్పాను కదా... ఆయన తరపు నుంచి లైన్ క్లియర్... కావల్సిందల్లా మీ అంగీకారమే..."

"అవును లతా...పాపం... ఇంతగా ప్రాధేయపడుతున్నాడు....ఒప్పుకో..." అన్నాడు పట్టాభి.

ఒక నిముషం ఆలోచించింది శ్రీలత.

"సరే..." అంది.

గాండీవి ఆనందంతో పొంగిపోయాడు.

"థాంక్యూ లతగారు... థాంక్యూ పట్టాభీ..." అన్నాడు.

ఆ మర్నాటినుంచే రిహార్సల్స్ ప్రారంభం అయ్యాయి. ఈ రిహార్సల్స్ తతంగం గాండీవి, శ్రీలతల మధ్య మరింత సన్నిహితం చేకూర్చింది.

గాండీవి తన కోతిమనసును అదుపులో పెట్టుకోలేక వీలున్నపుడల్లా శ్రీలతను తాకుతూ, ఆమె అందాల్ని తన కళ్ళతోనే జుర్రుకుంటూ రిహార్సల్స్ నడుపుతున్నాడు.

ఒక రోజు గాండీవి అన్నాడు.

"శ్రీలతగారూ... మిమ్మల్ని చూస్తుంటే నాకు జాలివేస్తోంది..."

ఆశ్చర్యపోయింది శ్రీలత.

"ఏం?" అంది.

"లక్షలకు లక్షలు ఆర్జిస్తూ, లక్షల కొలదీ అభిమానులను సంపాదించుకో

గల్గిన అందచందాలు వుండీ కూడా మీరు ఇలాగే వుండిపోయారు..."

అర్థంకాలేదు ఆమెకి.

"తెలుగు చలనచిత్ర కళామతల్లి కంఠహారంలో మీరు ముఖ్యమైన మణిగా వుండవల్సినవారు ... మీరు సినిమాల్లో నటించి వుండాల్సింది. ఇప్పుడు తెరమీద వెలుగుతున్న తారామణులు మీ ధాటికి తట్టుకోలేక తెరమరుగు కాక తప్పదు.." అన్నాడు.

శ్రీలత తన అందచందాలకు తనలో తానే గర్వపడటం కద్దు. ఆమె అందాన్ని చాలామంది స్నేహితురాళ్ళు కాలేజీలో పొగిడేవారు. ఆమె వెనకాల చాలామంది కుర్రాళ్ళు పడేవారు. ఈ రోజు గాండీవి మాటలు ఆమెకు సంతోషం కలిగించ డమే కాక ఆమెలో ఏ మూలో నిద్ర పోతున్న కోరికను తట్టి లేపాయి.

"భలేవారే ... మీరు ముఖస్తుతికి అలా అంటున్నారు కానీ... నాకు నటిం చడం ఏం వచ్చు కనుక?" అంది తేలిగ్గా శ్రీలత.

అందుకు ఒప్పుకోలేదు గాండీవి.

ఈ రోజుల్లో నటన ఎవరికి కావాలి? అది పూర్వకాలం మాట... ఈ రోజుల్లో కావల్సింది కేవలం గ్లామర్. తెరమీద అందంగా కన్పించే తారలు చాలామంది మామూలుగా వున్నపుడు మీ కాలిగోరుకి సరిపోరు. ఇక మీ సంగతంటారా... మేకప్‌లో తెరమీద కనపడితే ఏ దేవ కన్యో దిగివచ్చిం దనుకోవాలి. మీరు మానవకాంత అంటే ఎవ్వరూ నమ్మరు ..."

శ్రీలత ఆ పొగడ్తలకు ఉబ్బి పోయింది. నిజంగా తను తన టాలెంట్ ని వృధాచేసుకుంటున్నానా అని బాధపడింది. ఆమె కళ్ళముందు రంగుల కలలు తిరి గాయి. బ్రహ్మాండమైన మేడ, కార్లు, ఎందరో అభిమానులు ... లక్షలకొద్దీ డబ్బు, సంఘంలో ఉన్నతస్థానం ఆ కలలో కన్పించాయి.

చిన్నగా నిట్టూర్చింది.

"పోన్లెండి ... ఏం చేస్తాం? ఆ అదృష్టం లేదని సరిపెట్టుకుంటాను..." అంది బాధగా ఆమె.


నిట్టూర్పు ఆమెను పాతాళంలోకి కృంగదీసింది.

"అలా కాదు...చేతులు ముడుచుకుని కూర్చుంటే అదృష్టం తనంత తాను వచ్చి తలుపు తట్టదు. మనం ప్రయత్నిం చాలి. అందుకు కావాలంటే నేను సహాయం చేస్తాను" అన్నాడు గాండీవి.

"ఆయనకు ఇవి నచ్చవు. ఆయన తత్త్వం నాకు బాగా తెలుసు..." అంది శ్రీలత బాధగా.

"అవరోధాలు అన్నీ దాటుకుంటూ వెళ్తేనే మీ కలలు నిజం కాగలవు. నాకు తెలిసిన ఒక సినిమా డైరెక్టరున్నాడు. పట్టాభికి ఇష్టంలేకపోతే ముందుగా

మా ఆఫీసు పార్టీలో నేను వేసిన జోకులనంతా విని మా బాస్ విరగబడి నవ్వాడు. ఆఖరున నా జీతం పెంచమనడిగాను. అది కూడా ఒక జోకనుకొని నవ్వి - వెళ్ళిపోయాడు




చెప్పొద్దు ... మీరు బిజీతార అయిపోయాక తనంత తాను మీ గుమ్మంలోకి వస్తాడు...ఆలోచించుకోండి...మీకోసం నేను ఉద్యోగం వదులుకునేందుకు సిద్ధపడతాను ... మిమ్మల్ని ఆంధ్రుల అభిమాన తారగా చేసేందుకు సర్వ ప్రయత్నాలూ చేస్తాను. మీకొక మగతోడు అవసరం..." అంటూ గాండీవి ఆమెను ప్రోత్సహించాడు.

శ్రీలత ఆలోచనల్లో పడిపోయింది.

ఇటు సంసారం...అటు ఉజ్జ్వలమైన భవిష్యత్తు.

"చూద్దాంలెండి..." అంది తేలిగ్గా.

"అలాగే ... తొందరేం లేదు... కానీ సంఘానికి భయపడి మీ అందాన్ని ఎందుకూ పనికిరాకుండా చెయ్యకండి. ఈ ఆప్తమిత్రుడు మీ వెంట ఎల్లప్పుడూ వుంటాడు..." అన్నాడు.

రోజులు గడిచిపోతున్నాయి.

గాండీవి శ్రీలతలు వేసిన నాటకం బ్రహ్మాండమైన పేరు తెచ్చుకుంది.

దాంతో శ్రీలతకు తన నటనమీద మరింత నమ్మకం కల్గింది.

గాండీవి మాటలు ఆమెకు తరుచు గుర్తుకు రాసాగాయి.

తన భర్త అభిప్రాయం తెలుసుకునేందుకు ఒకరోజు సంభాషణ సినిమాతారల మీదకు మళ్ళించింది. అతను యధా ప్రకారం తన అయిష్టత వ్యక్తంచేశాడు.

"నాకూ సినిమా హీరోయిన్ కావాలని వుంది ... మీరు ఏమంటారు?" అంది సూటిగా.

పట్టాభి ఆమె ముఖంలోకి సీరియస్‌గా చూశాడు, ఆమెలో ఈ కోరిక ఎప్పుడు

పుట్టుకొచ్చిందా అని ఆశ్చర్యపోయాడు.

"నీకు విడాకులు ఇచ్చేస్తాను... ఈ పైత్యం నీకు కొత్తగా ఎప్పుడు కల్గింది? ఈ నాటకం వేశాకానా? జరిగింది చాలు.., ఇకముందు నాటకాల్లో కూడా వెయ్యకు. ఇంట్లో వుండి సంసారం చేసుకో... చాలు..." అన్నాడు పట్టాభి.

చిన్నబుచ్చుకుంది శ్రీలత భర్త మాటలకన్నా ఆమెను గాండీవి మాటలే ఎక్కువ ప్రభావితం చేశాయి. అందుకే ఒకరోజు రాత్రి ఒక ఉత్తరం పెట్టి గాండీవితోపాటు వెళ్ళిపోయింది.

• • •

ఆరు నెలలు గడిచిపోయాయి.

పట్టాభి గుండె రాయి చేసుకుని రోజులు వెళ్ళబుచ్చుతున్నాడు.

'భార్యా రూపవతీ శత్రుః' అన్న ఆర్యోక్తి అతను వినివున్నాడు కానీ అందులో ఇంత పచ్చినిజం వుందని ఇప్పుడే తెలుసుకున్నాడు.

అతనిలో ఎక్కడలేని నిరాశా చోటు చేసుకుంది. కొత్తగా సిగరట్లు అలవాటు చేసుకున్నాడు. ఏదో బ్రతకడానికి బ్రతికున్నాడు తప్ప అతనికి జీవితంమీద ఇంట్రస్టు లేదు.

"పోనీ...మళ్ళీ పెళ్ళిచేసుకోరా..." అంది అతని అక్క అన్నపూర్ణ.

"వద్దక్కా... ఇలాగే వుండిపోతాను ....ఆ రెండోపెళ్ళాం కూడా సినిమాలలో చేరడంకోసం వెళ్ళిపోతుంది..." అన్నాడు నిరాశగా.

"అదేమిట్రా... అందరూ శ్రీలత లాగే వుంటారా?" అంటూ నచ్చచెప్పబోయింది ఆమె.

"ఏమో ... నన్ను పెళ్ళిచేసుకున్న వాళ్ళందరికీ అలాంటి బుద్ధులే పుడతాయేమో!"

అన్నపూర్ణ ఎంతగానో ప్రయత్నించింది తమ్ముడిని ఒప్పించడానికి. కానీ ఆ ప్రయత్నాలు ఫలించలేదు

రోజులు గడుస్తున్నాయి.

పట్టాభి సాధారణంగా సినిమాలకు వెళ్ళడు. ఆ రోజు అతని మిత్రుడు ఒకడు ఏదో సందర్భంగా పార్టీ ఇస్తూ అతన్ని సినిమాకు తీసుకువెళ్ళాడు.

సినిమా చూస్తున్న పట్టాభి ఉలిక్కిపడ్డాడు.

అందుకు కారణం...తెరమీద శ్రీలత కన్పించింది.

చాలీచాలని గుడ్డలు వేసుకుని... హీరోని కవ్విస్తూ.... జుగుప్స కలిగించే పదజాలంతో నిండివున్న ఒక పాటకు అభినయం చేస్తూ ... కాదని దూరంగా పోతున్న హీరోని బలవంతంగా తన మీదకు లాక్కుంటూ...

పట్టాభి ఒంటినిండా కారంపూసుకున్నట్లు ఫీలయ్యాడు.

దానికి తగ్గట్టు ఆ కూడా వచ్చిన మిత్రుడు-




మీరు రోజూ బార్ లో తాగి నానా అల్లరి చేస్తున్నారని. ఎందుకైనా మంచిదని.. మేమే మీ శ్రీమతి ని పిలిపించాం సార్

"ఏరా... మీ అవిడలాగ వుంది... కదూ?" అన్నాడు.

సున్నిత మనస్కుడైన పట్టాభికి కళ్ళలో నీళ్లు ఒక్కటే తక్కువయ్యాయి. తెరమీదకు చూడలేక తల దించుకున్నాడు.

బొమ్మ కనపడకపోయినా పాట అయిపోయిన తర్వాత శ్రీలత మాటలు వినిపిస్తూనే వున్నాయి.

"ఏం శేఖర్? నన్ను కాదని పోతున్నావు? నేను అందంగా లేనా? లోకం అంతా నా అందం వెనకాల పరుగులు తీస్తుంటే నేను నీ వెనకాల పడ్డాను. నా కోరిక తీర్చు. నా అందం నీ స్వంతం చేసుకో..." అంటోంది శ్రీలత.

తడబడుతున్న కాళ్ళతో గబగబా నడుస్తూ బయటకు వచ్చేశాడు పట్టాభి.

* * *

పది సంవత్సరాలు గడిచిపోయాయి.

పట్టాభికి ఆ ఊర్నించి వేరే ఊరు బదిలీ అయ్యింది. తన భార్య చనిపోయిందన్న అబద్ధం చెప్పి, విధి చూసిన చిన్నచూపు కారణంగా భర్తను కోల్పోయిన అక్కగారు అన్నపూర్ణతో కలిసి వుంటున్నాడు. శ్రీలత గురించి ఇక్కడ ఎవ్వరికీ తెలియదు కనుక, ఎత్తిపొడిచి మాట్లాడేవారు లేరు కనుక, ఆ విషయం మరిచిపోయినట్లు ప్రవర్తిస్తున్నాడు.

శ్రీలత హీరోయిన్ కాలేకపోయింది, ఏదో పది పన్నెండు సినిమాలలో చిన్న చిన్న పాత్రలు పోషించింది. ఈ మధ్య అదీ లేదు.

ఒకసారి ఆఫీసుపనిమీద ఊరికి వెళ్ళి వచ్చాడు పట్టాభి. అక్కడ ఏమీ తోచటంలేదని ఏదో పాత సినిమాకు వెళ్తే అందులో మళ్ళీ శ్రీలత కన్పించి అతని మనసు కకావికలు చేసింది. అందుకే తిరిగి వచ్చినా కూడా అన్యమనస్కంగా ఉండిపోయాడు.

ఒక నాలుగురోజుల తర్వాత అన్నపూర్ణ అంది, సాయంత్రం తమ్ముడు ఆఫీసునుంచి వచ్చేకా.

"మర్చిపోయానురా... మీ ఆవిడ వుత్తరం రాసింది ... నువ్వు వూళ్ళో లేనప్పుడు వచ్చింది..." ఒక కవరు తీసుకొచ్చి తమ్ముడుకి ఇచ్చింది.

ముందు ఒక నిముషం అర్థంకాక అయోమయంలో పడిపోయాడు. పట్టాభి 'ఆవిడ...' అంటూ అక్కగారు ఎవరి గురించి అందో వెంటనే అర్థంకాలేదు అన్యమనస్కుడైనందున. కవరు చూశాడు. అది తన పాత చిరునామాకు వచ్చింది. అక్కడ్నుంచి ఎవరో రీడైరక్టు చేశారు.

కవరు చించి చదివాడు. అతని ముఖంలో రంగులు మారాయి. ఉత్తరం అలాగే చేతుల్లో వుంచుకుని పడక కుర్చీలో వెనక్కు వాలి కళ్ళు మూసుకుని పడుకున్నాడు. అతని గుండెల్లో సుడిగుండాలు.


అరగంట తర్వాత మళ్ళీ లేచి ఉత్తరం మరొకసారి చదువుకోబోయాడు. కళ్ళకు కన్నీటితెరలు అడ్డు రావడంవల్ల అక్షరాలు అలుక్కుపోయాయి. కళ్ళు తుడుచుకుని మళ్ళీ చదివాడు.

"పట్టాభిగారికి—

శ్రీలత నమస్కారములు! మిమ్మల్ని 'శ్రీవారూ' అంటూ సంబోధించకపోవడానికి కారణం ... ఆ అర్హత నేను పోగొట్టుకున్నాను కనుక. ఆ రోజుల్లో అందగత్తెనన్న గర్వం ... ఆ పైన గాండీవి మాటలు నన్ను మీ నుంచి దూరం కావడానికి ప్రోత్సహించాయి. ఎన్నో ఆశలతో ఇక్కడకు వచ్చాను. కలకు, వాస్తవానికీ ఎంత తేడా వుంటుందో తర్వాత గ్రహించాను. చిన్న వేషం దొరికింది. దాన్ని ఒప్పుకోమని గాండీవి ప్రోత్సహించాడు. ఒప్పుకున్నాను. ఆ తర్వాత కూడా అలాంటివే చిన్నచిన్న వ్యాంపు పాత్రలు వచ్చాయి తప్ప అంతకుమించి ఎదగలేకపోయాను. ఆ తర్వాత ఒక రోడ్డుప్రమాదంలో గాండీవి చనిపోవడంతో ఒంటరిదాన్నయ్యాను. తప్పించుకోలేని పరిస్థితులలో అపవిత్రం అయ్యాను. ఆ తర్వాత ఆ ఛాన్సులు కూడా కరువైనా ఒక్కర్తినీ ఇక్కడే వుండిపోయాను.

మీ మంచితనం నాకు తెలుసు... పొరపాటు చేశానని ఒప్పుకుని తిరిగి వస్తే నన్ను మీరు తప్పక ఆదరిస్తారు. కానీ అప్పటికే అపవిత్రం అయిన నేను మీ దరికి చేరాలనుకోలేదు. అందుకే ఒంటరి బ్రతుకు బ్రతికాను. నాలో పశ్చాత్తాపం కలిగిన తర్వాత మీ మంచితనం గుర్తుకు రాసాగింది. మిమ్మల్ని భగవంతుడిగా మనసులోనే ఆరాధిస్తూ గడిపాను!

ఇన్ని సంవత్సరాల తర్వాత ఇప్పుడు కూడా ఉత్తరం రాసేదాన్ని కాదు ... కాన్సర్ నన్ను పీడిస్తూ మృత్యుముఖంలోకి లాక్కెళ్ళకపోతే!




మిమ్మల్నొకసారి చూడాలనీ... వీలైతే మీ సన్నిధిలో కన్ను మొయ్యాలనీ వుంది. నేను చేసిన తప్పులు క్షమించి బయలుదేరి వస్తారు కదూ?

నా చిరునామా కూడా రాస్తున్నాను.

అభాగ్యురాలు—శ్రీలత"

"అక్కయ్యా..." అంటూ పిలిచాడు. అన్నపూర్ణ వచ్చింది!

"కనీసం నేను రాగానే ఈ ఉత్తరం నాకు ఎందుకు ఇయ్యలేదు?" అని అడిగాడు బాధగా.

తమ్ముడి ముఖంలోకి ఆశ్చర్యంగా చూసింది అన్నపూర్ణ.

"మర్చిపోయానురా ... అయినా అంత అర్జంటు ఏముంది? గూడువిడిచిన గువ్వ ఇన్ని సంవత్సరాల తర్వాత ఉత్తరం రాసింది. దానిన్ని నువ్వు పూర్తిగా మరిచిపోయావని నాకు తెలుసు ..." అంది అన్నపూర్ణ.

"అక్కా ..." అన్నాడు చిరుకోపంతో కూడిన బాధతో.

"ఎందుకురా నీకు అంత బాధ?" అంది అన్నపూర్ణ.

"ఎందుకేమిటి...ఆమె... ఆమె నా భార్య..." అన్నాడు పట్టాభి.

"హుఁ...భార్య... నువ్వు ఆమెకు ఆ గౌరవం ఇస్తున్నావు కానీ ఆ గౌరవము ఆమెలో వుందా?"

"పోన్లే అక్కా ... చిన్నపిల్ల ... అమాయకత్వంకొద్దీ తప్పు చేసింది. అంతమాత్రాన్న ఆమెను వెలివేస్తామా? ఆమె నాకు దూరం అయినా నేను మానసికంగా ఆమెకు దూరం కాలేదు. ఆమె అమాయకమైన ముఖం ఈరోజు కూడా నా కళ్ళముందు కనపడుతోంది. చేసిన తప్పుల్ని మన్నించటమే కదా మానవత్వం అంటే ... పైకి ఆమెను దూషించినా, ఆమె చేసిన పనికి అనుక్షణం మనసులో ముల్లుగుచ్చుకున్నట్టు బాధపడినా ఆమెను నేను నా మనసులోంచి

దూరంచేసుకోలేదు. అందుకే మరొక పెళ్ళి కూడా చేసుకోలేదు. చావుబ్రతుకుల మధ్య వున్న ఆమెను నేను చూసి తీరాలి... ఆమె చివరి కోర్కె తీర్చాలి ..." అన్నాడు పట్టాభి.

ఆ తర్వాత ఆత్రంగా లేచి గబగబా సూట్ కేస్‌లో నాలుగు జతల బట్టలు సర్దుకుంటున్న పట్టాభివంక వింతగా చూసింది అన్నపూర్ణ,

"అక్కా...మా ఆఫీసరుగారి ఇంటికి వెళ్ళి సెలవుకాగితం ఇచ్చేసి అట్నుంచి అటే ట్రైనుకి వెళ్ళిపోతాను. ఒక వారం రోజుల్లో తిరిగి వస్తాను" అన్నాడు శ్రీలత రాసిన ఉత్తరం జేబులో పెట్టుకుని చెప్పులు తొడుక్కుంటూ.

అన్నపూర్ణ మాట్లాడలేదు.

ఆమెదగ్గరకు వచ్చాడు.

"అక్కయ్యా... నేను చేస్తున్న ఈ పనికి నీకు బాధ కలుగుతుంటే నన్ను క్షమించు ... శ్రీలతకు అన్యాయం చెయ్యలేను, ఎవరు కాదన్నా ఆమె మాత్రం నాకు భార్య. వేదమంత్రాల ఘోషలో పచ్చని పందిరి క్రింద కళ్యాణ మంటపంలో ఆమె మెడలో మూడు ముళ్ళు వేశాను. వస్తాను..." అంటూ సూట్ కేస్ చేత్తోపట్టుకుని వెళ్ళిపోయాడు.

గుమ్మందాకా వచ్చిన అన్నపూర్ణకు చీకటిలో కలిసిపోయిన తమ్ముడు కనిపించలేదు.

రైల్లో కూర్చున్న పట్టాభి మనసు శ్రీలత చుట్టూ తిరుగుతోంది. ఆమె నాలుగురోజుల క్రితం మరణించిందన్న సంగతి అతను గమ్యం చేరినతర్వాతే తెలుసుకోగలడు.

---

**Printed and Published by A. Chandra Sekar Rao at 5-9-88, Public Garden R Hyderabad, for YUVA Publications and Printed at Dolton Press, Public Gar Road, Hyderabad-500 001. Editor A. SUDHAKARA RAO**